# ఎమ్మెల్యేల 'క్యాంప్' ఫైర్!


అర్బన్ క్యాంప్ కార్యాలయం

- అధికారిక నివాసాలపై వాస్తు పేరిట పేచీ
- కార్యాలయ మార్పునకు ప్రయత్నాలు
- నిజామాబాద్ రూరల్, అర్బన్ ఆఫీసులపై సందిగ్ధం
- ముందుకురాని కొత్త శాసనసభ సభ్యులు
- తలలు పట్టుకుంటున్న ఆర్అండ్‌బీ అధికారులు

నిజామాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలపై వాస్తు పేరిట పేచీ మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రెండు వారాలు కూడా గడువక ముందే ఇద్దరు కొత్త ఎమ్మెల్యేల మధ్య ''క్యాంప్'' కార్యాలయం కాక రేపుతోంది. ఒకరు అధికార పార్టీకి చెందిన వారు, మరొకరు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే కావడంతో ఇరువురి మధ్య సంధి కుదర్చలేక సంబంధిత అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంగా పని చేసే ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య తలెత్తిన ఈ కొత్త రకమైన ఆధిపత్య పోరుపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. గెలిచి నాలుగు రోజులు కాకుండానే చిన్న పాటి అంశంపై చిచ్చు పెట్టుకోవడం ఏంటంటూ ప్రశ్నిస్తున్నారు. విషయంలోకి వెళ్తే ..నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అధికారిక నివాసం జడ్పీ కార్యాలయం సమీపంలో ఆర్అండ్‌బీ అతిథి గృహం పక్కన నిర్మించారు. ఈ క్యాంప్ కార్యాలయం అర్బన్ ఎమ్మెల్యేకు సంబంధించినది కాగా.. రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన క్యాంప్ కార్యాలయాన్ని వినాయక్ నగర్‌లో నిర్మించారు. వీటిని గెలిచిన ఎమ్మెల్యేలు ఈపాటికి తమ ఆధీనంలోకి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. వాస్తు దోషం పేరుతో పేచీలు పెట్టుకోవడంతోనే సందిగ్ధతకు తెరలేచినట్లు తెలుస్తోంది.

**వాస్తు పేరిట వాయిదాలు**

నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేల మధ్య తలెత్తిన క్యాంప్ ఫైర్‌పై బీజేపీ, కాంగ్రెస్ నాయకులే ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చర్చించుకుంటున్నారు. అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దిన క్యాంప్ కార్యాలయాలను వాడుకోవడం మానేసి వాస్తు దోషం పేరిట వాయిదాలు వేసుకోవడం ఏంటంటూ ప్రజలు సైతం ప్రశ్నిస్తున్నారు. కొత్త ఎమ్మెల్యేల తీరుతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలకు క్యాంప్ కార్యాలయం కేటాయింపుపై అధికారులు సంప్రదింపులు జరుపడంతోనే ఈ విషయం బయట పడింది. నిజామాబాద్ అర్బన్ క్యాంప్ కార్యాలయాన్ని ఆధీనంలోకి తీసుకోవాలంటూ బీజేపీ ఎమ్మెల్యేకు ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ఇప్పటి వరకు ఎవరూ క్యాంప్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోకపోవడంతో వినాయక్ నగర్‌లోని రూరల్ నియోజకవర్గానికి వెళ్లేదెవరనే ప్రశ్న ఉత్పతన్నమవుతున్నది. అర్బన్ ఎమ్మెల్యేకు సంబంధించిన క్యాంప్ కార్యాలయాన్ని రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తీసుకునేందుకు సానుకూలంగా ఉన్నారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. వాస్తు దోషం పేరుతో ఎమ్మెల్యేలు తమ అధికారిక నివాసాలను మార్చుకునే ప్రక్రియ నడుస్తుండడం సర్వత్రా చర్చకు దారితీసింది.ప్రజలకు కుల, మతాలకు అతీతంగా సేవ చేయాల్సిన వ్యక్తులే మూఢ విశ్వాసాలకు పెద్దపీట వేయడం ఏంటంటూ జనాలు ప్రశ్నిస్తున్నారు.

**మార్పు కష్టమే...**

గతంలో ఏ ప్రభుత్వమూ తీసుకోని చర్యలను కేసీఆర్ సర్కారు అమలు చేసింది. ఎమ్మెల్యేలకు క్యాంప్ కార్యాలయాను నిర్మించింది. ప్రజలు తమ గోడును వెల్లబోసుకునేందుకు గాను ఈ అధికారిక నివాసాలు చక్కని వేదికలుగా నిలిచేలా వీటిని ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈ నెల 3న వెల్లడవగా.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 14న బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వీరికి అధికారిక నివాసాలను ప్రభుత్వ యంత్రాంగం కల్పించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదిలోనే ఎదురైన ఈ ఆటంకాలతో వారంతా నెత్తి పట్టుకోవాల్సి వస్తోంది. కొత్త ఎమ్మెల్యేలను కలిసేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతుండగా వారు ఏ ప్రాంతంలో ఉంటున్నారో? తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు. మిగిలిన చోట్ల ఎమ్మెల్యేల అధికారిక నివాసాల విషయంలో పేచీలేమీ లేకపోగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనే ఈ తంతు బహిర్గతం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్బన్, రూరల్ నియోజకవర్గాలకు వేర్వేరుగా నిర్మించిన క్యాంప్ కార్యాలయాల మార్పు జిల్లా అధికారుల చేతిలో లేనట్లుగా తెలుస్తోంది. ఒకవేళ మార్పు తథ్యమైతే ప్రభుత్వం నుంచి ఆర్డర్ రావాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఎవరికి వారు క్యాంప్ కార్యాలయాన్ని మార్చుకునే వెసులుబాటు ఉండబోదని వారు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ క్యాంప్ కార్యాలయంలో వాస్తు దోషం పేరుతో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే కూడా ప్రభుత్వమే నిధులు విడుదల చేయాల్సి ఉంటుందని చెప్పడం గమనార్హం.

# 'నిజాంసాగర్' నీటి విడుదల పెంపు

నిజాంసాగర్, డిసెంబర్15: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి విడుదలను శుక్రవారం పెంచారు. ఈనెల 14వ తేదీన యాసంగి పంటల సాగు కోసం వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటి విడుదలను ప్రారంభించగా.. ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలను శుక్రవారం ఉదయం 1375 క్యుసెక్కులకు పెంచి విడుదల చేస్తున్నట్లు ఏఈ శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1405.00 అడుగులకు (17.80 టీఎంసీలు) గాను 1403.76 అడుగుల(16.02 టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నదని పేర్కొన్నారు. ప్రధాన కాలువ ద్వారా 1375 క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా మరో 217 క్యూసెక్కుల నీరు ప్రధానకాలువ, వరద గేట్లు, హెడ్‌రెగ్యులేటర్ల ద్వారా ప్రవహిస్తుందని వివరించారు. ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రైతులను కోరారు.

**అధికారుల నిర్వహణ లోపం.. కాలనీల్లోకి జలం**

ఆయకట్టు కింద యాసంగి పంటల సాగు కోసం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. అయితే గాలీపూర్ గ్రామ శివారుకు నీటిని అందించే ఏడో నంబర్ డిస్ట్రిబ్యూటరీ నుంచి గేట్లను ఒక్కసారిగా పైకి లేపడంతో పంట పొలాలకు పెద్దమొత్తంలో నీరు వచ్చి చేరింది. దీంతో పంటపొలాలతో పాటు గ్రామంలోని పలు కాలనీల్లోకి ప్రవహిస్తున్నది. నీటి పారుదల శాఖ అధికారుల నిర్వహణ లోపంతో ఎవరు పడితే వారు ఇష్టానుసారంగా అవసరానికి మించి నీటిని తూముల ద్వారా విడుదల చేస్తుండడంతో నీరు వృథాగా మంజీరాలో కలుస్తున్నదని, దీంతో చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తూముల వద్ద పర్యవేక్షణ కొనసాగించాలని రైతన్నలు కోరుతున్నారు.


గాలీపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో ప్రహిస్తున్న నిజాంసాగర్ నీరు

# జీవన్‌రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

## విద్యుత్ అధికారులకు హైకోర్టు ఆదేశం

ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 15: హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌కు విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని కారణంగా ఆశన్న గారి రజితారెడ్డికి చెందిన జీవన్‌రెడ్డి మాల్‌కు అధికారులు ఇటీవల విద్యుత్ సరఫరాను నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాల్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. విద్యుత్ సరఫరా నిలిపివేత వెనుక రాజకీయ ప్రమేయం,కక్ష సాధింపు చర్యలు ఉన్నాయని పేర్కొంది. నిబంధనల ఉల్లంఘన జరగకపోయినా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి జీవన్ రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసి భారీగా ఆర్థిక నష్టం వాటిల్లడానికి కారణమయ్యారని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం విద్యుత్ శాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పది నిమిషాల్లోగా జీవన్ రెడ్డి మాల్ కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని శుక్రవారం ఆదేశించింది. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే జీవన్ రెడ్డి మాల్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## సీపీకి మాదాపూర్ ఎంపీటీసీ-2 మీరాబాయి కుటుంబ సభ్యుల వినతి


జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయానికి వచ్చిన మీరాబాయి కుటుంబీకులు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 15 : మాక్లూర్ ఎంపీటీసీ–2 మీరాబాయిని కిడ్నాప్ చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు శుక్రవారం సీపీకి విన్నవించారు. ఎంపీటీసీ కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ –2 మీరాబాయిని ఈ నెల 10వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో మాస ప్రభాకర్(ఎంపీపీ), సుక్కి సుధాకర్, గోపు రంజిత్ ఇంటికి వచ్చి కిడ్నాప్ చేసి తీసుకెళ్లారన్నారు. ఈ విషయమై ఈ నెల 12వ తేదీన మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ తల్లిని కిడ్నాప్ చేసిన ముగ్గురి పై చర్యలు తీసుకొని.. తమ తల్లిని విడిపించాలని కోరారు. ఎంపీటీసీ మీరాబాయిని వదిలిపెట్టకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటగిరి లక్ష్మీ శ్రీనివాస్ హెచ్చరించారు.

# మానిక్‌బండార్ తండాలో క్షుద్ర పూజలు

- అడ్డుకున్న తండావాసులు
- పూజలు చేస్తున్న వారిపై దాడి.. పోలీసుల లాఠీచార్జి
- నిలువరించే ప్రయత్నంలో ఏఎస్సైకి గాయాలు
- గ్రామంలో పోలీసు బలగాల మోహరింపు


క్షుద్రపూజలు చేసిన లక్కపాటి అరవింద్

మాక్లూర్, డిసెంబర్ 15: మండలంలోని మానిక్‌బండార్ గ్రామ శివారు మానికబండార్ తండాకు చెందిన శ్మశానవాటికలో గురువారం రాత్రి క్షుద్రపూజల కలకలం రేపింది. శ్మశాన వాటికలో అమ్రాద్ గ్రామానికి చెందిన లక్కపాటి అరవింద్,ఆర్మూర్‌కు చెందిన కొందరు వ్యక్తులతో కలిసి క్షుద్రపూజలు చేస్తుండగా..విషయం తెలుసుకున్న తండావాసులు అక్కడికి చేరుకొని వారిపై దాడి చేశారు. దీనిపై సమాచారం అందుకున్న మాక్లూర్ ఏఎస్సై గంగాధర్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. గాయపడినవారిని పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా తండావాసులు అడ్డుకొన్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఏఎస్సై గంగాధర్ కన్ను, తలకు గాయాలయ్యాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నార్త్ రూరల్ సీఐ నరహరి, సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ సతీశ్ బలగాలతో అక్కడికి చేరుకొన్నారు. ఏఎస్సైతోపాటు గాయపడిన వారిని దవాఖానకు తరలిస్తుండగా.. తండావాసులు అడ్డుకొన్నారు. తమ గ్రామ శ్మశాన వాటికలో అరవింద్ క్షుద్రపూజలు తరచూ చేస్తున్నాడని, దీంతో తండాకు చెందిన 15 మంది చనిపోయారని, మరికొందరు అనా రోగ్యంతో బాధపడుతున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో తండావాసులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేయగా.. తండావాసుల్లో కొందరికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శుక్రవారం పోలీసు బలగాలను మోహరించారు.

**పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం : ఇన్‌చార్జి ఏసీపీ**

గురువారం రాత్రి జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వివరాలను వెల్లడిస్తామని ఇన్‌చార్జి ఏసీపీ విజయసారథి తెలిపారు. శుక్రవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. క్షుద్రపూజలు చేస్తున్న అరవింద్‌తోపాటు మరో 12మంది పూజలో పాల్గొన్నారని, వారిపై తండా వాసులు దాడి చేశారని తెలిపారు. గాయాలైన వారు దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. పోలీసుల విధులకు అడ్డుతగలడమే కాకుండా మాక్లూర్ ఏఎస్సై గంగాధర్‌పై చేయి చేసుకోవడంతో ఆయనకు గాయాలయ్యాయని, శాంతి భద్రతలను కాపాడే ప్రయత్నంలో భాగంగానే వారిని చెదరగొట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారని వివరించారు.రెండు పోలీసువాహనాలు, ఒక బస్సు , మూడు వాహనాల అద్దాలను తండాకు చెందిన వ్యక్తులు ధ్వంసం చేశారని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

తెలుగులో ఉచిత ఖురాన్ కొరకు
ఫోన్ చేయండి
1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

WANTED
★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.